# 28. అవకాశాలు

శావల్ అప్పుడే నిద్రనుంచిలేచి ఏడ్వసాగాడు. ఆ రోజే చాలా నిరుత్సాహకరంగా వుంది. ఆకు రాలేకాలం కావటంవల్ల – ఆకులు మెల్లిమెల్లిగా రాలుతున్నాయ్. వానకూడా సాగటంవల్ల – ఆకులు బరువుగా రాలుతూ అదొక చిన్నవానను జ్ఞాపకం చేస్తున్నాయ్. శావల్ గదిలో అటూ ఇటూ తిరగసాగాడు.

అతని జీవితం చెడురోజుల్తో గడుస్తోంది. గత అరవై రెండు సంవత్సరాల్లోలాగే ఆ జీవితంలో చెడురోజులు తప్ప ఇంకేమీలేవు. తను ముసలి బ్రహ్మచారి. తనకు 'నా' అనే వాళ్లెవరూ లేరు. తనమీద ఇష్టంలేకున్నా 'ఇష్టాన్ని' చూపుతూన్న వాళ్లమధ్య ఒంటరిగా చావటం – అబ్బ! ఎంత కష్టం!

నిస్సారమై విచారకరమైన తన జీవితాన్ని గుర్చి అతను ఆలోచించసాగాడు; గడిచిన రోజుల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాడు. తన చిన్నతనమూ, తను తల్లిదండ్రుల్తో నివసించిన ఇల్లూ, తన కాలేజీ జీవితమూ, తనుచేసిన తప్పులూ – పారిస్‌లో తను పని నేర్చుకుంటూండటమూ – తన తండ్రికి జబ్బుచేసి మరణించటమూ – తను తల్లితో కాలం గడపటమూ మొదలైనవి గుర్తొచ్చినయ్. తల్లీ తనూ చెప్పుకోదగ్గ కోరిక లేకుండానే ప్రశాంతంగా కాలం గడిపారు. తరువాత తనతల్లి మరణించింది. జీవితం ఎంత విచారంతో కూడుకుంది! తను ఒంటరిగానే బతుకుతూ వచ్చాడు. తనుకూడా కొన్నాళ్లకు – కొద్దిరోజులకే చనిపోతాడు. తను మాయమౌతాడు – అంతే – ఆఖర్! భూమిమీద శావల్ అనేవాడే ఉండడు. ఎంత భయంకరమైన విషయం! పాడుతూ హాయిగా హాయిగా నవ్వుతూ ఇతర ప్రజలందరూ బతికి ఉంటారు...మరి తను కనిపించకపోతే మాత్రం వాళ్లకేం? తప్పనిసరిగా చస్తామని తెలిసికూడా యీ ప్రజలందరూ సంతోషంతో బతక గలగటం – నిర్విచారంగా బతికే ఆశ కొంత వుంటుంది. కాని అది రాత్రి తరువాత పగలు వొచ్చినట్టు – తప్పనిసరి!

ఏమైనా తన జీవితాంతం అతి దాపులోనే వుంది; తను ఏమైనా గొప్పపనులు చేసివుంటే–? ఏవైనా సాహసకార్యాలు – తనకు మహానందాన్నిచ్చేవి – పోనీ చెప్పుకోదగ్గ

గెలుపులు – కనీసం తనకు తృప్తినిచ్చేవి – కాని ఏమీలేవు. తను ఏమీ చెయ్యలేదు. పొద్దున్నే లేచి – సరిగ్గా నిన్నటివేళలోనే భోంచేసి మళ్లీ నిద్రకు శయ్యజేరటం – అంతే! ఈ విధంగా అరవై రెండేళ్లు గడిచినయ్! ఇతర పురుషుల్లాగు కనీసం తను పెళ్లన్నా చేసుకోలేదు...ఎందుకనీ? ఔను... తనకు పెళ్లి ఎందుకు కాలేదు? తనకు కొద్ది ఆస్తికూడా వుంది. కనుక తనకు పెళ్లి ఐవుండాల్సిందే! తను పోగొట్టుకున్న సదవకాశాల్లో ఇదికూడా వొకటా? కావొచ్చు!....కాని ప్రతి జీవితంలోనూ సదవకాశాలు వొస్తయ్; కాని తను అలాటి వాటిని లెక్క చెయ్యలేదు–అంతే! 'లెక్క చెయ్యకపోవటం' అనేది తన జీవితం మీద గొప్ప దెబ్బతీసింది. అదే తనలోని లోపం – అదే తన జీవితంలోని అపజయాలన్నింటికీ కారణం! లెక్కచెయ్యక పోవటంవల్ల ఎంతమంది జీవితాల్ని పాడుచేసుకుంటున్నారు!

కనీసం తను ప్రేమలోనన్నా పడలేదు. తన హృదయాన్ని ఏ స్త్రీ కూడా ప్రేమతో నింపలేకపోయింది. ప్రేమలో ఉండే మధురమైన ఆనందంకానీ, స్వర్గ సౌఖ్యాన్నిచ్చే శరీర స్పర్శకాని, పరవశత్వాన్ని ప్రసాదించే ఉద్రేకాన్ని కానీ – తను ఎరగనే ఎరగడు! మొట్టమొదటిసారి పెదవులు కలిసినప్పుడు పొందే ఆనందం ఎలాటిదో, నాలుగు చేతులూ పెనేసుకొని ఒకే మూర్తిగా మారినప్పటి సౌఖ్యం ఎలాటిదో అతనికి తెలియదు.

శావల్ కాలిమీద కాలేసుకొని పక్కమీద కూర్చున్నాడు. నిశ్చయంగా తన జీవితం పాడైంది – పూర్తిగా పాడైపోయింది!... కాని తను ప్రేమించాడు...అది రహస్యంగా తను కనిపెట్టకుండానే జరిగింది. అసలు తను లెక్కచెయ్యక పోవటం తన జీవితంలో ప్రతి నిమిషంలోనూ జరిగేదే!... తను – తన పాతస్నేహితుడు సొౖడిస్ భార్యనే ప్రేమించాడు ... అబ్బ! ఆమె యువతిగా ఉన్నప్పుడే తనకు పరిచయం ఉన్నట్టయితే!... కాని అలా జరగలేదు; ఆమెతో తనకు పరిచయం ఏర్పడేప్పటికే ఆమెకు వివాహమైపోయింది....కాని అంతకు ముందే తన స్నేహం సంపాయించినట్టయితే – ఆమెను వివాహమాడే ప్రయత్నం జరిగేది; నిస్సంశయంగా ఆమె తనకు భార్యయ్యేది.

తను ఆమెను చూసిన మొట్టమొదటిసారే గాఢంగా – హృదయ పూర్వకంగా ప్రేమించాడు. ఉద్రేకం కలగకుండా తను ఆమెను చూసిన క్షణాలన్నీ జ్ఞాపకం చేసుకున్నాడు: తను ఆమెను వొదిలి యింటికి వొచ్చాక ఎంత విచారించేవాడు! ఆమెను గూర్చిన ఆలోచనవల్ల తను ఎన్ని రాత్రులు నిద్రకు దూరమయ్యాడు!

గడిచిన సాయింత్రంకన్న నిరుత్సాహంతో ఉదయం నిద్రనుంచి మేల్కొనేవాడు; ఎందుకనీ? జవాబు తెలియలేదు.

ఆమె చలాకీ, అందమూ చూస్తే సొౖడిస్ ఆమెకు తగిన భర్త కాడని వెంటనే తెలిసిపోయింది. ఆమెకు ఇప్పుడు యాభై రెండేళ్లు ... కాని ఆమె ముఖంలో సౌఖ్యపడుతూన్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. అబ్బ! ఆ గడిచిన రోజుల్లోనే

తను ఆమెను ప్రేమించి ఉన్నట్టయితే! తను ఆమెను అంత గాఢంగా ప్రేమిస్తున్నప్పుడు ఆమె తనను ఎందుకు ప్రేమించలేదూ?

ఆమె తన ప్రేమను ఏ రూపానైనా బైటపెట్టి ఉన్నట్టయితే-? ఆమెకు అవకాశమే లేకపోయిందా? కాని ఆమె ఏమనుకున్నదో? తను తన ప్రేమ విషయం బైట పెట్టినట్టయితే-ఆమె ఏం సమాధానం ఇచ్చేదో?

శావల్ ఇలాటివే లక్ష ప్రశ్నలు వేసుకున్నాడు. తన జీవితాన్నంతట్నీ పరామర్శ చేసుకున్నాడు-యీ విషయంలో ఏమైనా విశేషాలు దొరుకుతయ్యేమోనని.

సాడ్రిస్ భార్య యవ్వనంలో వుండగా-ఆమె అమిత అందంగా కనిపించే రోజుల్లో - సాడ్రిస్ ఇంటిదగ్గర తను గడిపిన సాయింత్రాలన్నీ జ్ఞాపకం చేసుకోసాగాడు. ఆమె తనతో మాట్లాడిన అనేక విషయాల్నీ, మాట్లాడేప్పుడు ఆమె ఉపయోగించే మధురమైన కంఠధ్వనినీ, అనేక అర్థాలకు తావిచ్చే ఆమె చిరునవ్వుల్నీ - గుర్తు చేసుకున్నాడు.

సాడ్రిస్, అతని భార్యా, తనూ - ముగ్గురూ కలిసి సైనీ నదీతీరాన గడిపిన రోజులు - ఆదివారాలు ఆ నదిఒడ్డున పచ్చికమీద కూర్చొని భోంచెయ్యటమూ మొదలైన విషయాలు అతని ఊహలో దొర్లినయ్... నదీ తీరానికి దాపుగాఉన్న పొలంగట్టుమీద ఆమెతో గడిపిన ఒక మధ్యాహ్నపు దృశ్యం అతనికి గుర్తొచ్చింది:

ఆనాడు భోజనం బుట్టల్లో పెట్టుకొని ఉదయానే బయలుదేరారు. ఆనాటి వాతావరణం చాలా ఉత్సాహకరంగా వుంది. చూసే ప్రతివస్తువా ఆనందాన్నిస్తోంది; ప్రతిది కొత్తవాసనల్ని వెదజల్లుతోంది. పక్షుల రెక్కలు వేగంగా కొట్టుకుంటున్నాయ్; వాటి కూతల్లో మహదానందం ధ్వనిస్తోంది. నదిలోని జలంమీద సూర్యకిరణాలుపడి మెరుస్తున్నాయ్...వారు తీరానికి చాలాదగ్గర్లో గడ్డిమీద కూర్చొని భోంచేశారు. కొత్త పైర్లమీంచి మెల్లిగా హాయిగా వీచేగాలి పరవశం చేస్తోంది. ఆనాడు ప్రతిదీ ఎంత ఆనందకరంగా వుంది!

భోజనాలయ్యాక, సాడ్రిస్ పడకకు ఉపక్రమించాడు. 'జీవితంలో ఎప్పుడూ ఇంత మంచినిద్ర పోలేదు' అన్నాడు సాడ్రిస్ నిద్ర మేల్కొన్నాక.

ఆమె తనచేతిని పట్టుకుంది. ఇద్దరూ నదీతీరాన నడవసాగారు. ఆమె సున్నితంగా తన భుజం మీద వాలింది. తరువాత ఆమె నవ్వి అంది: "నేను మత్తెక్కి ఉన్నాను....అమితంగా మత్తెక్కింది..."

తను ఆమె ముఖంలోకి చూశాడు; అప్పుడు తన హృదయం అమిత వేగంగా కొట్టుకుంది. తను తెల్ల మొగం వేసినట్టు తనకు తోచింది. కాని తను ఆమెను అంత ధైర్యంగా చూడగలిగాడా? ఒణికే తన చేతులు తన ఉద్రేకాన్ని సూచించలేదుకద?

ఆమె అడివి పువ్వులతోనూ, కలవ పువ్వులతోనూ అలంకరించుకొని తనను అడిగింది : "నేను ఇలా ఉంటే బాగుంటుందా?"

దీనికి తన కేమీతోచక, జవాబు చెప్పలేక ఆమెముందు మోకరించాడు. ఆమె అసంతృప్తిని సూచించే కంఠంతో - పెద్దగా తనకు దగ్గరగా ముఖముంచి ఫక్కున నవ్వి, "బుద్ధిహీనుడిలాగు...కనీసం మాట్లాడలేవా?" అంది.

తనకు ఏడుద్దా మనిపించింది...అప్పటిక్కూడా తనకు మాట్లాడేందుకు ఒక్క మాటకూడా దొరకలేదు.

ఈ విషయాలన్నీ అవి జరిగిన నాడంత స్పష్టంగా గుర్తొస్తున్నాయ్; "బుద్ధిహీనుడిలాగు..కనీసం మాట్లాడలేవా?" అని ఆమె ఎందుకన్నది?

ఆమె ఎంత సున్నితంగా తన భుజంమీద వాలిందీ అతను జ్ఞాపకం చేసుకున్నాడు. తరువాత చెట్లకిందినుంచి నడుస్తుండగా ఆమెచెవి తన చెంపకు ఆనించింది...కాని తను తమ కండరాలే కలుస్తయ్యేమో నన్నంత భయంతో తన తలను అవతలికి తిప్పేశాడు.

"మనం వెళ్లే వేళయింది" అని తను అన్నప్పుడు ఆమె తనవైపు వింతగా చూసింది.

"తప్పకుండా-"

ఆ 'తప్పకుండా' అన్నమాట తనను గూర్చిన వింత అభిప్రాయాన్నే వెలిబుచ్చుతోంది. అప్పుడు తను ఏ ఇతర విషయాన్ని గూర్చీ ఆలోచించలేదు. కాని ఇప్పుడు ఆ విషయమంతా విప్పిచెప్పినట్టు తోస్తోంది.

"నీ ఇష్టం వొచ్చినట్టుకానియ్...నువ్వు అలిసి ఉన్నట్టయితే వెళ్లిపోదాం-" అందామె.

"నాకు అలుపు వొచ్చిందనికాదు...సొడ్రిస్ యీపాటికి మేల్కొని ఉంటాడని-" అని తను జవాబిచ్చాడు.

ఆమె అంది: "మా ఆయన లేస్తాడనే భయంఉంటే - అది వేరేవిషయం... సరే మనం తిరిగి వెళ్దాం-"

తిరిగి వొచ్చేప్పుడు ఆమె తన భుజంమీదికి వొంగలేదు; ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది... ఎందుకనీ?

ఇది వరకు ఎప్పుడూ సంభవించనట్టు యీసారిమాత్రం 'ఎందుకనీ?' అని ప్రశ్నించుకోవటం అతనికి చాలా అవసరంగా తోచింది. అప్పుడు తనకు అర్థం కాని దేదో - ఇప్పుడు బాగా అర్థమౌతోంది!

అది ఏమైవుంటుంది?

శావల్‌కు తను చాలా సిగ్గుపడుతూన్నట్టుతోచి-ఎగిరి గంతేశాడు. తనకు ముప్పై సంవత్సరాలు వెనక్కు జరిగినట్టుగా తోచింది. సొడ్రిస్ భార్య తనతో 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని విప్పి చెప్పినంతగా తనకు తోచింది.

ఈ అనుమానానికి తావుందా? ఇది తన అంతరాత్మను పీడిస్తోంది. తను చూడనిది - కనీసం స్వప్నంలోనన్నా అనుభవించనిది సాధ్యమా?

అబ్బ! కాని అదే నిజమైతే! అంత అదృష్టమే తనకు పట్టినట్టయితే దాన్ని తను వొదిలేవాడా?

అతను తనలో అనుకున్నాడు: 'నేను యీ విషయాన్ని తెలుసుకోవాలి. అనుమానంతో బాధపడటం దుర్భరం. తప్పకుండా తెలుసుకు తీరాలి–'

అతను త్వరత్వరగా దుస్తులు ధరించాడు. 'నాకు అరవై రెండేళ్ల వయస్సు; ఆమెకు యాభై ఎనిమిదేళ్లు...కనుక యీ వయస్సులో బాధపడకుండానే ఆమె జవాబు చెప్తుంది...' అనుకున్నాడు.

వెంటనే అతను బయలుదేరాడు. సౌద్రిస్ ఇల్లు వీధికి అవతలవైపు - దాదాపు తన ఇంటికి ఎదురుగానే వుంది. అతను వెళ్లి తలుపు కొట్టాడు; దాసీపిల్ల వొచ్చి తలుపు తీసింది.

"ఇప్పుడు - ఇంత పొద్దున్నే వొచ్చారు - ఏమైనా ప్రమాదం సంభవించిందా?" అంది దాసీది.

"లేదు...నేను ఇప్పుడు ఆమెతో మాట్లాడాలని - అమ్మగారికి చెప్పు–"

"అమ్మగారు - చలికాలానికిగాను ఊరగాయ పెడుతున్నారు... వంటింట్లో చిన్న గుడ్డతో ఉన్నారు–"

"ఔను...కాని ఆమెతో చెప్పు - అతిముఖ్య విషయం మాట్లాడాలని."

దాసీది వెళ్లిపోయింది; శావల్ నరాల బలహీనతలో డ్రాయింగ్‌రూంలో పెద్ద పెద్ద అంగల్తో పచార్లు చెయ్యసాగాడు. అతనికేమీ సంతోషంగాలేదు. ఇంతా ఏడుస్తే తను అతిస్వల్ప విషయంమీద ఆమెను ప్రశ్నించ బోతున్నాడు! అది 'నాకు అరవై రెండేళ్ల వయస్సని తెలుసా?' అన్నంత స్వల్పవిషయం!

-తలుపు తెరవబడ్డది; ఆమె ప్రవేశించింది. ఇప్పుడు ఆమె బలిష్ఠంగా పెరిగిన శరీరంతో - విచారకరమైన నవ్వుతో, నున్నని చెక్కిళ్లతో కనిపించింది. ఆమె గౌను చేతుల్ని పైకిలాగుతూ నడిచింది; ఆమె తెల్లని నున్నని చేతులు చూస్తే శావల్‌కు పంచదార జ్ఞాపకం వొచ్చింది.

ఆమె ఆతృతతో ప్రశ్నించింది: "ఏమిటీ - విశేషం? నువ్వు ఆరోగ్యంగానే ఉన్నావనుకుంటాను - ఔనా?"

"అదేమీలేదు." కాని నేను ఒక విషయాన్ని గూర్చి అడగాలనుకున్నాను. అది చాలా ముఖ్యమైంది: నా హృదయాన్ని దహించేస్తోంది. నువ్వు నిజాన్ని దాచకుండా సమాధానం చెప్తానని ప్రమాణంచేస్తే...?" అని ఆగాడు.

ఆమె నవ్వి అంది: "నేను ఎప్పుడూ నిజాన్నే చెప్తాను. ఏమిటో -చెప్పు."

"సరే...విను: నేను నిన్ను చూసిన మొదటి రోజునుంచి నిన్ను గాఢంగా ప్రేమించసాగాను. ఈ విషయమై నీకేమన్నా అనుమానమా?"

ఆమె ఆ చిన్ననాటి గొంతుతో నవ్వి అంది: "భలేవాడివి - ఆ సంగతి నాకు ఆ మొదటిరోజునుంచే తెలుసు."

శావల్ ఒణకసాగాడు. బిగ్గరగా అన్నాడు: "ఐతే నీకు తెలుసన్నమాట... మరి...?"

ఆమె అంది: "మరి...మరి..ఏమిటీ?"

"ఐతే నువ్వు ఏం అనుకున్నావ్?...మరి...నువ్వు ఏం జవాబు చెప్పే దానివీ?"

ఆమె సన్నగా మధురంగా నవ్వి అంది: "నేనా?...కాని నువ్వు నన్నేమీ అడగలేదుకదా? ఆ సంగతి ముందుగా బైటపెట్టాల్సినదాన్ని నేను కాదుగా-?"

ఆమెవైపు ఒక అడుగు ముందుకువేసి, శావల్ అన్నాడు: "ఆనాడు... భోంచేశాక సొడ్రిస్ గడ్డి మీదపడి నిద్రపొయ్యాడే... మనం నదీతీరాన మలుపు దాకా కలిసివెళ్లామే-ఆ రోజు నీకు జ్ఞాపకం వుందా?"

అతను సమాధానంకోసం ఆగాడు; ఆమె నవ్వటం ఆపి అతనివైపు సూటిగా చూడసాగింది.

"ఔను...నాకు బాగా జ్ఞాపకం వుంది-" అందామె.

శావల్ ఒణుకుతూన్న కంఠంతో మాట్లాడసాగాడు: "ఆ రోజు - ముందుగా నేనే నిన్ను కోరినట్టయితే - నువ్వు ఏం చేసేదానివి?"

ఏ విచారమూలేని దానిలాగు - హాయిని సూచిస్తున్న నవ్వునవ్వి - నిజాన్ని రూపించే కంఠంతో అంది: "నేను లొంగేదాన్ని-"

తరువాత మళ్లీ ఒకసారి నవ్వి, మడమలమీద గిరుక్కున తిరిగి - వంట ఇంటివైపు నడిచింది.

శావల్ చప్పున వీధిలోపడ్డాడు. పెద్ద విపత్తు సంభవించిన వాడిలాగు విచారంగా నేలచూపులు చూస్తూ, పెద్దపెద్ద అంగల్తో - తను ఎక్కడికి వెళ్తోందీ ఆలోచించకుండానే వానలోపడి సూటిగా నడవసాగాడు. తనను ఏదోశక్తి ప్రేరేపిస్తూన్నట్టు చాలాసేపు నడిచాడు. అతనిటోపీ పూర్తిగా తడిసి - పూరి కొంపమీంచి జారే వానను జ్ఞాపకం చేస్తోంది. అతని బట్టలు పూర్తిగా నానిపోయినయ్...చివరకు - చాలా కాలంకిందట తను ఆమెతోనూ, ఆమె భర్తతోను కలిసి భోంచేసినచోటికి వొచ్చాడు. ఆ ప్రదేశంలో జరిగిన ఘట్టాలు అతన్ని మళ్లీ జ్ఞాపకంవొచ్చి - అతన్ని పీడించసాగినయ్. ఆకులులేని చెట్టుకింద కూర్చొని శావల్ ఏడ్వసాగాడు.....